
సాక్షి
సంగారెడ్డి
సోమవారం । 9 । జూన్ । 2025



శనిగరం అద్భుతం
శనిగరం నీటి ప్రాజెక్టు నేటికీ 134 ఏళ్ల యినా చెక్కు చెదరకుండా రైతులకు సాగు నీటిని అందిస్తోంది. వివరాలు 8లో ▸



యంత్రం సాగుకే మొగ్గు
కూలీల కొరతను అధిగమించేందుకు కిసాన్ మేళాలో రైతులు సాగు యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు. వివరాలు 8లో ▸



సన్నబియ్యంపై ఆసక్తి
సన్నబియ్యం పథకానికి లబ్ధిదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బడిబాట ర్యాలీలు



బడిబాటలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కొడకంచి, నల్తూర్ తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య వసతులను వివరించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ నుంచి ప్రభుత్వ పాఠశాలలోకి ప్రవేశాలు కల్పించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆదివారం సెలవు దినమైన బడిబాట కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొగిలిమాల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో బోర్ల తవ్వకాలు



బోరు డ్రిల్లింగ్‌కోసం హనుమాన్ తండాలో పూజలు నిర్వహించిన తండావాసులు

నారాయణఖేడ్: తాగునీటి సమస్య పరిష్కారానికి పలు గ్రామాలు, తండాలకు బోర్ల తవ్వకం కోసం జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ తన కోటా నిధుల ద్వారా ఒక్కోబోట బోరు తవ్వకం, మోటారు బిగించడం, పైపులైను ఏర్పాటు పనులకోసం రూ.3 లక్షల చొప్పున కేటాయించారు. ఆదివారం ఖేడ్ మండలం స్కూల్ తండా, హన్మాన్ తండాలతోపాటు మనూరు మండలం రాణాపూర్ గ్రామంలో బోర్ల తవ్వకాలను ఆయా తండాల పెద్దలు, గ్రామస్తులు పూజలు నిర్వహించి ప్రారంభించారు. నీటి ఎద్దడి నివారణకోసం ఎంపీ నిధులు కేటాయించడం పట్ల ఆయా తండాల వాసులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఎంపీ, ఎమ్మెల్యే





శివనందిని, లలితాంబిక దేవిని దర్శించుకుంటున్న షెట్కార్, సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని మనూరు క్రాస్‌రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన లలితాంబిక దేవి ఆలయంలో నిర్వహిస్తున్న లలితాంబిక దేవి సహిత శివనంది, గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర, నాగదేవత, నంది, ధ్వజ, శిఖర విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు, త్రయహ్నిక యాగమహోత్సవాలు మూడవరోజైన ఆదివారం కొనసాగాయి. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, యువజనకాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్, మాజీ జెడ్పీటీసీ జితేందర్‌నాథ్ షెట్కార్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు.

వేల కోట్ల అవినీతిలో బీజేపీ, బీఆర్ఎస్ పాత్ర

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడం ప్రాజెక్టు ఖర్చు రూ.60 వేల కోట్ల నుంచి రూ.90 వేల కోట్లకు పెంచడం రూ.30 వేల కోట్ల అవినీతిలో బీజేపీ,బీఆర్ఎస్ పాత్ర ఉన్నట్లు కనిపిస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆదివారం పటాన్‌చెరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రాజెక్టులపై మాజీమంత్రి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం హంతకుడే సంతాప సభ పెట్టినట్టు ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 35 పథకాలతో రాష్ట్రంలోని సంబండ వర్గాల ప్రజల కార్మిక కర్షక అభివృద్ధిలో దూసుకుపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యువరాజ్, రతన్‌సింగ్, అంజయ్య, మల్లేశ్, రవి, ప్రకాశ్, ఆశిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పిట్ మెజర్‌మెంట్‌కు పాతర

- కళ్లు మూసుకున్నందుకు అధికారులకు కాసులు!
- మైనింగ్ కుంభకోణంలో అధికారుల పాత్రపై అనుమానాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాళ్ల, ఖనిజాల క్వారీల్లో అక్రమ మైనింగ్ దందాకు భూగర్భ గనుల శాఖ అధికారులు అడుగడుగునా వంత పాడారా.? రూ.వందల కోట్లు సీనరేజీ ఎగవేసి ఇష్టానుసారంగా ఖనిజ సంపదను కొల్లగొడుతుంటే అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఈ అధికారులకు కాసుల వర్షం కురిసిందా..? జిల్లాలో వెలుగు చూసిన రూ.974 కోట్ల మైనింగ్ కుంభకోణంలో భూగర్భ గనులశాఖ అధికారుల పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మైనింగ్ మాఫియా నుంచి ప్రతినెలా పెద్ద మొత్తంలో దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసిన ఆశాఖ అధికారులు కోట్లకు పడగలెత్తారనేది సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో స్టోన్ అండ్ మెటల్ క్వారీల్లో నిర్వహించిన ఈటీఎస్ సర్వేలో భారీ మైనింగ్ కుంభకోణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. అడ్డగోలు సహజ సంపదను లూటీ చేసిన 15 మైనింగ్ కంపెనీలకు రూ.974 కోట్లు చెల్లించాలని ఆశాఖ డిమాండ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. రాజకీయ అండదండలతో ఇష్టానుసారంగా దోపిడీ చేసిన మైనింగ్ మాఫియా..జిల్లాలోని సహజ సంపదను లూటీ చేసింది. విచ్చల విడిగా తవ్వకాలు జరిపి విలువైన స్టోన్ అండ్ మెటల్‌ను తరలించి రూ.వేల కోట్లు వెనుకేసుకుంది.



భూగర్భ గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం

ఇన్నేళ్లు ఎందుకు చేయలేదు..?

ఏదైనా మైనింగ్ లీజు మంజూరు చేస్తే...ఆ లీజు తీసుకున్న క్వారీలో ఎంత మొత్తంలో ఖనిజ సంపద తవ్వి రవాణ చేశారు. తరలించిన ఈ ఖనిజ సంపదకు అంతేమొత్తంలో భూగర్భ గనులశాఖకు సీనరేజీ చెల్లించారా..? అనేది ఎప్పటికప్పుడు సరి చూసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం నిర్ణీత సమయంలో పిట్ మెజర్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలి. కనీసం ఏడాదికి ఒకసారైనా మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి ఈ పిట్ మెజర్‌మెంట్ ప్రక్రియను నిర్వహించాలి. పిట్ మెజర్‌మెంట్ చేస్తే ఎంత మొత్తంలో ఖనిజాన్ని తవ్వారనేది తేలిపోతుంది. అయితే ఏళ్ల తరబడి ఈ పిట్ మెజర్‌మెంట్ జరగలేదు. ఎంతన్నా తవ్వుకుని పోనివ్వు..మాకు ప్రతి నెలా మామూళ్లు ఇస్తే చాలన్నట్లు ఆశాఖ అధికారులు వ్యవహరించారనే విమర్శలున్నాయి. ఈ అక్రమ మైనింగ్‌పై ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. కనీసం ఫిర్యాదులు వచ్చిన క్వారీల్లోనైనా ఈ పిట్ మెజర్‌మెంట్ ప్రక్రియ నిర్వహించలేదంటే..ఆ శాఖ అధికారులు ఈ దోపిడీకి ఏ మేరకు సహకరించారనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పెద్ద మొత్తంలో ముడుపులు అందుకుని కళ్లు మూసుకున్నారనే విమర్శలున్నాయి.

సిబ్బంది లేమితోనే!

పిట్ మెజర్‌మెంట్ ప్రక్రియ నిర్ణీత సమయంలో ఎందుకు నిర్వహించలేదనే విషయమై 'సాక్షి'భూగర్భ గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబును వివరణ కోరగా.. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఈ పక్రియ సకాలంలో జరిగి ఉండక పోవచ్చన్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో ఈ ప్రక్రియ జరగాల్సి ఉంటుందని ఇకపై ఎప్పటికప్పుడు ఈ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పారు.

అధికారుల పాత్రపై విచారణ

జిల్లాలో వెలుగు చూసిన మైనింగ్ కుంభకోణంలో ఆ శాఖ అధికారుల పాత్రపై విచారణ జరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ అసిస్టెంట్ డైరెక్టర్లుగా, జియాలజిస్టులుగా, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు.. ఇలా వివిధ హోదాల్లో పనిచేసిన అధికారుల పాత్ర ఈ కుంభకోణంలో ఎంత వరకు ఉందనే అంశంపై లోతైన విచారణ జరగాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఇక్కడ పనిచేసిన అధికారులు చాలామంది రూ.కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిమ్జ్‌లో హ్యుందాయ్ విస్తరణ

- 675ఎకరాలు.. రూ.8,500కోట్ల పెట్టుబడులు
- పరిశ్రమ ఏర్పాటుకు స్థలం కేటాయింపు
- త్వరలో భూములు పరిశీలనకు ప్రతినిధులు

సంగారెడ్డిజోన్: జహీరాబాద్ నియోజకవర్గంలోని జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి (నిమ్జ్)లో ఏర్పాటు కానున్న హ్యుందాయ్ పరిశ్రమను మరింత విస్తరించనున్నారు. ఇప్పటికే హ్యుందాయ్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక్కడి ప్రాంతాల్లో పరిశ్రమ విస్తరణకు అనుకూలమైన నేలలు ఉండటంతో హ్యుందాయ్ ప్రతినిధులు పరిశ్రమను విస్తరించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదిలా ఉండగా నిమ్జ్‌లో వేమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

పరిశోధనాభివృద్ధి కేంద్రం ఏర్పాటు

దక్షిణ కొరియా ఆటోమెటివ్ దిగ్గజ సంస్థ హ్యుందాయ్ రాష్ట్రంలోని నిమ్జ్‌లో ఆ సంస్థ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపించనుంది. సుమారు 675 ఎకరాల విస్తీర్ణంలో రూ.8,500కోట్లతో నెలకొల్పనున్నారు. ఇందులో ఆటోమెటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ లైన్, ప్రోటో టైపింగ్ ఏర్పాటు కానున్నాయి. అదేవిధంగా కార్ల తయారీతోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు, వాహనాల టెస్టింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగా 4,000లకు పైగా ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఇక్కడి ప్రాంతంలో 407 ఎకరాల విస్తీర్ణంలో ఇదే పరిశ్రమ వాహనాల టెస్టింగ్ ట్రాక్ నిర్మించేందుకు భూములను కేటాయించింది. అయితే ప్రస్తుతం రిసెర్చ్ సెంటర్‌ను స్థాపించాలని నిర్ణయించింది.



ఝరాసంగం మండలంలోని నిమ్జ్ ప్రాంతం

అనుకూలమైన భూములు గుర్తింపు

ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామ శివారులో పరిశ్రమ ఏర్పాటుకు మొదటగా భూమిని కేటాయించారు. పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన భూములలో సాంకేతిక బృందం సభ్యులు సుమారు 50 పాయింట్లలో 20 మీటర్ల మేర లోతులో మట్టి నమూనాల్లో సేకరించి పరిశ్రమల స్థాపనకు భూములు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు.

త్వరలో భూములు పరిశీలించనున్న పరిశ్రమ ప్రతినిధులు

నిమ్జ్‌లో పరిశ్రమ స్థాపన కొరకు పరిశ్రమ ప్రతినిధులు త్వరలో పర్యటించి, భూములు పరిశీలించనున్నారు. ఇందుకోసం ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్, ఎల్గోయి ప్రాంతాల్లో భూములను కేటాయించారు.

చేప ప్రసాదానికి పోటెత్తిన జనం

ఉబ్బసం, దగ్గు, దమ్ము వ్యాధిగ్రస్తులకు పంపిణీ

నారాయణఖేడ్: ఉబ్బసం, దగ్గు, దమ్ము వ్యాధిగ్రస్తులకు మృగశిర కార్తెను పురస్కరించుకుని నిజాంపేట్ మండల కేంద్రంలో ఆదివారం పంపిణీ చేసిన చేప ప్రసాదానికి జనాలు బారులు తీరారు. రాష్ట్రంలోని వివిధప్రాంతాలతోపాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలనుంచి వేలాదిమంది తరలివచ్చారు. ఏటా గ్రామంలోని తమ ఇంటివద్ద పంపిణీ చేస్తూ వస్తుండగా ప్రసాదం కోసం వస్తున్న వేలాదిమందికి స్థలం చాలక పోతుండటంతో ఈసారి గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కనే టెంట్లు వేసి పంపిణీ చేపట్టారు.

తడ్కంటి సోదరులు తడ్కంటి పర్వాగౌడ్, లింగాగౌడ్, నాగరాజు, శంకర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సాయిబాబా గౌడ్‌లు వ్యాధిగ్రస్తులతో చేపప్రసాదాన్ని మింగించారు. దూర ప్రాంతాల నుంచి కొంతమంది ప్రసాదం కోసం శనివారం సాయంత్రం నిజాంపేటకు చేరుకోగా వారికి నిర్వాహకులు బస ఏర్పాట్లు చేశారు.



రోగులకు చేపప్రసాదం పంపిణీ చేస్తున్న తడ్కంటి సోదరులు



సింగూరు ప్రాజెక్టు వద్ద చేపలు విక్రయిస్తున్న వ్యాపారస్తులు

జోరుగా చేపల విక్రయాలు

పుల్‌కల్(అందోల్): మృగశిరకార్తె సందర్భంగా సింగూరు ప్రాజెక్టు వద్ద చేపలు అమ్మకం ఆదివారం జోరుగా సాగాయి. సమీప గ్రామాల ప్రజలతోపాటు సదాశివపేట, జోగిపేట, సంగారెడ్డి, జహీరాబాద్, మునిపల్లి ప్రాంతాల ప్రజలు సింగూరు డ్యాంను చూసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో చేపలు కొనుగోలు చేశారు.

కేంద్రంపై కార్మికలోకం ఉద్యమించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

జిన్నారం (పటాన్‌చెరు): కేంద్రంలోని మోదీ సర్కార్ కార్మిక లోకానికి వ్యతిరేకంగా నాలుగు లేబర్ చట్టాలను అమలు చేయాలని చూస్తోందని, వెంటనే వాటిని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ నాలుగు కోడ్‌లను ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లి టీఐడీసీ పరిశ్రమ కార్మికులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లేబర్ చట్టాలు అమల్లోకి వస్తే 95% కార్మికులకు వెట్టిచాకిరిలోకి వెళ్లిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని 12 గంటల వరకు పెంచుతారని అలాగే కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్‌ఐ బోనస్ సౌకర్యాలు కూడా అందవని చెప్పారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని కార్మిక వర్గం అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లేశ్, రాజయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, శ్రీరాములు, ప్రభాకర్, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

ముదిరాజ్‌ల సంక్షేమానికి సహకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- అమీన్‌పూర్‌లో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని ముదిరాజ్‌ల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య రోడ్డులో నూతనంగా నిర్మించనున్న ముదిరాజ్ భవనం పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సేవా దృక్పథం, ధైర్యానికి మారుపేరైన ముదిరాజ్‌లు తెలంగాణ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సొంత నిధులతో ముదిరాజ్‌ల కోసం సంక్షేమ సంఘం భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పటాన్‌చెరులోని ముదిరాజ్ భవన్‌ను రూ.రెండు కోట్ల రూపాయల సొంత నిధులతో ఆధునీకరించినట్లు గుర్తు చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంలో ముదిరాజ్‌లు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, మాజీ కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కొల్లూరి మల్లేశ్, బాలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గోపీనాథ్ మృతికి సంతాపం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే,సీనియర్ నాయకులు మాగంటి గోపీనాథ్ అకాల మరణం పట్ల ఎమ్మెల్యే గూడెం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరుసగా మూడు సార్లు శాసన సభకు ఎన్నికై..ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సాధించుకున్న గోపీనాథ్ మరణం రాష్ట్ర ప్రజలకు తీరని లోటని అన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకోసం ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు నెలకొల్పనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ భారత్ మిషన్- గ్రామీణ్ కింద రూ. 61.28 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కేంద్రం 60శాతం, రాష్ట్రం వాటా 40శాతం ఉండనుంది. ఈ నిధులకు వివిధ టార్గెట్లను నిర్ణయించారు. ఆగస్టు చివరి వరకు పూర్తి చేయాలన్న లక్ష్యంతో డీఆర్‌డీఏ అధికారులు ముందుకు సాగుతున్నారు. – సాక్షి, సిద్దిపేట

పల్లెల్లో రీసైక్లింగ్

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 జీపీలకు రూ.61కోట్లు
- 11 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు మంజూరు
- ఓడీఎఫ్ దిశగా నూతన పంచాయతీలు

జిల్లాల వారీగా చేపట్టే పనులు

యూనిట్‌లు	మెదక్	సంగారెడ్డి	సిద్దిపేట	మొత్తం నిధులు
వ్యక్తిగత మరుగుదొడ్లు	1,200	15,606	3,000	రూ. 23.76కోట్లు
ఇంకుడు గుంతలు	5,744	7,390	5,931	రూ. 12.39కోట్లు
సామూహిక ఇంకుడు గుంతలు	898	1,091	876	రూ. 15.70కోట్లు
సెగ్రిగేషన్ షెడ్లు	24	11	15	రూ. 80లక్షలు
మేనేజ్‌మెంట్ ప్లాస్టిక్ వేస్ట్	03	04	04	రూ. 7.04కోట్లు
పారిశుద్ధ్య సమూహాలు	15	19	19	రూ. 1.59కోట్లు

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం



"ఎస్‌బీఎంలో మంజూరైన నిధులకు టార్గెట్‌కు అనుగుణంగా గ్రామాల వారీగా ప్రతిపాదనలు తెప్పిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఎంపికలు కాగానే వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తాం. ఆగస్టులోగా పనులు పూర్తి అయ్యేలా ముందుకు సాగుతున్నాం. అలాగే కొత్తగా ఏర్పాటైన గ్రామాలను ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాం."
–జయదేవ్ ఆర్యా, డీఆర్‌డీఓ, సిద్దిపేట

పల్లెల్లో తొలిసారిగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు 11 మంజూరు చేశారు. ఒక్కోదానికి రూ.64లక్షల చొప్పున రూ.7.04కోట్లను కేటాయించారు. రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలో ఈ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వివిధ రకాల వస్తువులను తయారు చేయనున్నారు. ప్రాసెస్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్, రికవరీ ప్రక్రియల ద్వారా వివిధ ఉత్పత్తులను తయారు చేస్తారు. పునర్వినియోగానికి పనికిరాని ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేయడం కానీ, ల్యాండ్ ఫిల్లింగ్ చేయడం చేయనున్నారు. కాలుష్యంను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

19వేల మరుగుదొడ్లు మంజూరు

ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ నిధులతో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఒక్కో మరుగుదొడ్డి కోసం రూ.12వేల చొప్పున కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు 19,806 వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం రూ.23.76 కోట్లను మంజూరు చేశారు. పర్యాటక ప్రాంతాలు, పాఠశాలలు, మార్కెట్ స్థలాలు, ఆస్పత్రులు, బస్టాండ్లు అవసరమైన చోట్ల 53 శానిటేషన్ కాంప్లెక్స్‌లను రూ.1.59కోట్లతో నిర్మించనున్నారు.

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు ఉమ్మడి మెదక్ జిల్లాకు 53 కేటాయించారు. ఒక్కోదానికి రూ.3లక్షల నిధులు మంజూరు చేశారు. ఇందులో నిధులు ఎస్‌బీఎం నుంచి 70శాతం, 15వ ఆర్థిక సంఘం నిధులు 30శాతం మంజూరు చేయనున్నారు.



50 నూతన పంచాయతీల్లో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 గ్రామ పంచాయతీలలో నూతనంగా 50 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. నూతనంగా మెదక్‌లో 24, సంగారెడ్డిలో 11, సిద్దిపేటలో 15 గ్రామ పంచాయతీలను బహిరంగ మలమూత్రవిసర్జన రహిత గ్రామాలుగా తయారు చేయడానికి అధికారులు కార్యాచరణ రూపొందించారు.

క్లుప్తంగా

కూలిన పట్టుపురుగుల షెడ్డు



గాలి వానకు కూలిన పట్టు పురుగుల షెడ్డు

కౌడిపల్లి(నర్సాపూర్): మల్బరి పట్టు పురుగుల షెడ్డు ఈదురు గాలులతో కూడిన వర్షానికి కూలింది. ఈ ఘటన మండలంలోని రాయిలాపూర్‌తండాలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన సునావత్ రాజు తన పొలంలో కొన్నేళ్ల క్రితం మల్బరి పట్టుపురుగుల షెడ్డు నిర్మించాడు. ప్రస్తుతం లాభాలు సరిగా లేకపోవడంతో ఖాళీగా ఉంది. కాగా రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన రావడంతో షెడ్డు పూర్తిగా కూలింది. రేకులు, గోడలు సైతం ధ్వంసమయ్యాయి. దీంతో రాజుకు సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

కలశం విగ్రహం వెలుగులోకి..



హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి మల్లికార్జునస్వామి ఆలయ పునర్‌నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం పునాది తవ్వుతుండగా రాతి కలశం విగ్రహం బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో 1996లో కూడా పెద్ద శివలింగం బయటపడటంతో అక్కడే దేవాలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. పొట్లపల్లి నూటొక్క దేవాలయాలకు నిలయంగా ఉండేదని చరిత్ర కారులు అభిప్రాయపడుతున్నారు. మల్లికార్జునస్వామి వారి విగ్రహం కూడా గతంలో బయట పడటంతో అక్కడే గుడి నిర్మించి పూజలు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ

ముగ్గురికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామ చౌరస్తా తూప్రాన్– నర్సాపూర్ హైవేపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏదుల్లాపూర్ పులుగం వాడకు చెందిన సంజీవరెడ్డి గ్రామం నుంచి బైక్‌పై దొంతి వైపునకు వస్తున్నాడు. వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మి, నర్సిహులు దంపతులు శివ్వంపేటలో పెళ్లికి వెళ్లి గ్రామానికి బైక్‌పై వస్తుండగా రెండు బైక్‌లు ఉసిరికపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్సిహులు తలకు తీవ్ర గాయాలు కావడంతో స్పృహ తప్పి పడిపోగా, లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. సంజీవరెడ్డికి గాయాలవ్వగా చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి..

అక్కన్నపేట(హుస్నాబాద్): వృత్తిలో భాగంగా ఓ గీత కార్మికుడు తాటిచెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గౌరవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బైరగోని రవి ఆదివారం గ్రామ సమీపంలోని తాటివనంలోని తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి పడటంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు.

మహిళ మృతదేహం లభ్యం

సంగారెడ్డి క్రైమ్: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ రమేష్ వివరాల ప్రకారం... స్థానిక మహబుబ్‌సాగర్ చెరువు కట్ట పరిసర ప్రాంతంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శనిగరం అద్భుతం

జలాశయం నిర్మించి 134 ఏళ్లు


చుట్టూ ఎత్తైన కొండలు.. పరుచుకున్న పచ్చని చెట్లు..వాటి మధ్యలో నిండుకుండలా అందమైన ప్రాజెక్ట్. కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో ఆరో నిజాం రాజు మీర్‌మహబూబ్ అలీఖాన్ 1887లో జలాశయం నిర్మాణం ప్రారంభించగా 1891లో పూర్తయింది. నేటికి 134 ఏళ్లు..అయినా చెక్కు చెదరకుండా ఉంది. మొదట్లో 4,827 ఎకరాల్లో ఆయకట్టు ఉండేది. ప్రస్తుతం రెండు మండలాల్లో కలిపి 5100 ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు అందుతోంది.

– కోహెడ రూరల్ (హుస్నాబాద్):



ప్రాజెక్టు రాగి తూము

- సీసం, డంగు సున్నం, బంకమట్టితో నిర్మాణం
- నేటికీ చెక్కు చెదరని ప్రాజెక్ట్
- 9 గ్రామాల్లో 5100 ఎకరాలకు సాగు నీరు
- వందేళ్లు దాటినా లీకేజీలు లేవు



శనిగరం జలాశయం

నిర్మాణానికి 504 కిలోల బంగారం ఖర్చు

శనిగరం గ్రామంలో నిజాం కాలంలో మధ్యతరహా ప్రాజెక్టు నిర్మాణం అప్పటి చీఫ్ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణలో నిర్మించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతిపెద్ద చెరువుగా శనిగరం ప్రాజెక్టు ఉండేది. ఈ పురాతన జలాశయం కోసం ఆ కాలంలో 560 సీర్లు (504 కిలోల బంగారం)ఖర్చు చేశారు. చెరువు తూము, ఆనకట్టను నున్నటి బండరాళ్లు ఒకదానిపై ఒకటి పేర్చి వాటి మధ్యలో సీసం, డంగు సున్నం, బంకమట్టిని నింపి నిర్మించారు. ఇప్పటికీ చెరువు నిండా నీరున్నా ఒక్క చుక్క కూడా లీక్ కాదు. నాడు చేపట్టిన పనులు అంత అద్భుతంగా ఉండటమే కారణమని పలువురు అంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం ఒక టీఎంసీ ఉండి 42 అడుగుల ఎత్తులో ఉంటుంది.

5100 ఎకరాలకు సాగు నీరు

శనిగరం గ్రామంలో నిర్మించిన ప్రాజెక్టుతో కోహెడ, బెజ్జంకి మండలాల్లో కాలువల ద్వారా 9 గ్రామాలకు 5100 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ప్రత్యేకత ఏంటంటే ఈ రిజర్వాయర్ నిండినా ఎలాంటి ప్రమాదం లేకుండా నీరు వాటంతట అవే పోయేలా పాలింగ్ గేట్లను మొదట అమర్చారు. ఈ తరహా గేట్లు తుప్పు పట్టడంతో ఆధునీకరించి కొత్త గేట్లు బిగించారు. రైతులకు, మత్స్యకారులకు ఈ చెరువు కల్పతరువుగా మారింది. గంగమ్మ, దాయాల మత్తడి కాలువల ద్వారా వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతోంది.

మత్తడి దుంకితే.. పర్యాటకుల శోభ

రాజీవ్ రహదారికి కూతవేటు దూరంలో ఉండటంతో పర్యాటక శోభ పెరుగుతోంది. ఎగువ కురిసిన వర్షాలతో మోయ తుమ్మెద వాగు ద్వారా, గుట్టల మధ్య నుంచి నీరు రావడంతో ప్రాజెక్టు చూపరులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం నీటి మట్టం తగ్గింది. కాగా శనిగరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల పర్యటనకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ టూరిజం స్పాట్‌గా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులకు ఆధారం



మా గ్రామంలోని రైతులకు ప్రాజెక్టు ఆధారం. సుమారు ఐదువేల ఎకరాల్లో రెండు పంటలకు నీరు అందుతోంది. బోరు, బావుల్లో నీరు కంటే ఈ నీటితో పంటలు బాగా పండుతాయి. ఈ ప్రాంత రైతులకు ఇదే జీవనాధారం.

–గునిగంటి రాజయ్య, రైతు, శనిగరం

100 టన్నుల చేపల ఉత్పత్తి



ప్రాజెక్టుపై వెయ్యి మందికి పైగా మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి సంవత్సరం 100 టన్నులకు పైగా చేపల ఉత్పత్తి అవుతోంది. చేపలతో పాటు రొయ్యలు కూడా ఇక్కడ లభిస్తాయి.

– సూతరి కనకయ్య, సంఘం నాయకులు

ప్రాణం తీసిన కోతుల గుంపు

బైక్‌కు అడ్డురావడంతో కిందపడి మహిళ మృతి

నంగునూరు(సిద్దిపేట): కోతులగుంపు అడ్డురావడంతో బైక్‌పై వెళుతున్న మహిళ కిందపడి మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం అక్కెనపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎండి ఆసిఫ్ కథనం ప్రకారం... చిన్నకోడూరు మండలం సికింద్రాపూర్‌కు చెందిన జలిగామ కనకవ్వ(60) అక్కెనపల్లిలోని తన తమ్ముడు రాజు గృహ ప్రవేశానికి వెళ్లింది. తిరిగి అల్లుడు హరీశ్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో ఓ ఇంటివద్ద కోతుల గుంపు అడ్డుగా వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో కనకవ్వకు తీవ్రగాయాలయ్యాయి. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని దుండగుల చేతిలో వ్యక్తి హత్య

సిద్దిపేటఅర్బన్: గుర్తుతెలియని దుండగులు వ్యక్తిని హత్య చేశారు. ఈ ఘటన సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగధాంపల్లి పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన బోదాసు నర్సింహులు (40) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అప్పుడప్పుడు పని నిమిత్తం సిద్దిపేటకు వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 6న పని నిమిత్తం సిద్దిపేట వచ్చి ఇంటికి వెళ్లకుండా అక్కడే ఉన్నాడు. 7వ తేదీన తెలిసిన వారి ఫోన్ నుంచి భార్యకు ఫోన్ చేసి తన బండిని ఎవరో ఎత్తుకెళ్లారని, వెతికి ఇంటికి వస్తానని చెప్పాడు. ఆదివారం ఉదయం రంగధాంపల్లి పరిధిలోని మయూరి దాబా వెనక ఖాళీ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బోదాసు నర్సిహులుగా గుర్తించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి ఒంటిపై ఎలాంటి ఆయుధాలతో దాడి చేసిన ఆనవాళ్లు లేవని, పిడిగుద్దులు గుద్దడం వల్ల చనిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాము కాటుతో వలస కూలీ మృతి

సిద్దిపేటఅర్బన్: నిద్రలో పాము కాటు వేయడంతో వలస కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం... అస్సాంకు చెందిన అయానుద్దీన్ (44) భార్యాపిల్లలతో కలిసి రెండేళ్లుగా కిష్టసాగర్‌లో ఉంటూ లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే వారు ఉంటున్న గదిలో నేలపై పడుకున్నారు. శనివారం తెల్లవారుజామున అయానుద్దీన్ చేతిపై పాము కరిచినట్టు అనిపించడంతో విషయం భార్యకు చెప్పాడు. అనంతరం వారి యజమానికి చెప్పడంతో వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. కాగా ఆస్పత్రికి తరలించిన అనంతరం వారి గదిలో వెతకగా నాగుపాము కనిపించడంతో చంపేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు ..



గంగారాం(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గంగారాం(42) చేపలు పట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా గాలి వీచడంతో ప్రమాదవశాత్తు తెప్ప బోల్తా పడింది. దీంతో గంగారాం నీటిలో మునిగి చేపల వలలో చిక్కుకుని మృతి చెందాడు. వెంటనే వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించింది. కల్హేర్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

ఇద్దరిని బలి తీసుకున్న వివాహేతర సంబంధం

హవేళిఘణాపూర్(మెదక్): వివాహేతర సంబంధం ఇద్దరిని బలి తీసుకుంది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ధరావత్ నరేష్ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం బయటకు రావడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 3న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ 7న మృతి చెందింది. ఈ విషయం తెలిసిన వెంటనే నరేష్ లింగ్సాన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో ఉరివేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

హోమ్‌లోన్ ఇప్పిస్తామని నమ్మించి మోసం

శివ్వంపేట(నర్సాపూర్): హోమ్ లోన్ ఇప్పిస్తామని మోసం చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మండల పరిధిలోని బిజ్లిపూర్ గ్రామానికి చెందిన కట్టమీది శ్రీకాంత్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి 10 లక్షల హోమ్‌లోన్ ఇప్పిస్తామని నమ్మించారు. అందుకు గాను వివిధ చార్జీల నిమిత్తం ఏప్రిల్ నుంచి విడతల వారీగా రూ.45 వేల 720 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. మరిన్ని డబ్బులు చెల్లించాలని సూచించడంతో మోసపోయానని గ్రహించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

హత్నూర (సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రమైన హత్నూరలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మంగలి నరసింహులు వారం రోజుల క్రితం టేక్మాల్ పశువుల సంతలో 1.50 లక్షలు పెట్టి రెండు ఎడ్లను కొనుగోలు చేశాడు. ఆదివారం గ్రామ శివారులో మేత కోసం రెండు ఎడ్లను తీసుకొని వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ కింద ఓ ఎద్దు మేత మేసేందుకు వెళ్లడంతో విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. దీంతో కళ్ల ఎదుటే లక్షల రూపాయలు పెట్టి తెచ్చిన ఎద్దు మృతి చెందడంతో బాధితుడు బోరున విలపించాడు.

లిఫ్ట్ ఇచ్చి.. ఆభరణాలు చోరీ

వృద్ధురాలి బంగారు, వెండి కడియాలు అపహరణ



చోరీకి పాల్పడిన నిందితుడి సీసీ టీవీ చిత్రం

మనోహరాబాద్(తూప్రాన్): లిఫ్ట్ పేరుతో వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకున్న గుర్తుతెలియని దుండగులు బంగారు, వెండి ఆభరణాలతో ఉడాయించారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన మండలంలోని పరికిబండ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మన్నె రామవ్వ అనే మహిళ శనివారం గజ్వేల్ మీదుగా వర్గల్ మండలంలోని పాములపర్తికి బయలుదేరింది. ఈ క్రమంలో గజ్వేల్‌లో బస్సు కోసం ఎదురు చూస్తుండగా బైక్‌పై వచ్చిన వ్యక్తితో పాటు మరో మహిళ వృద్ధురాలిని మాటల్లో పెట్టి పాములపర్తిలో దించుతానని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. పాములపర్తిలో దింపకుండా మనోహరాబాద్ మండలంలోని పరికిబండ శివారుకు తీసుకొచ్చి ముగ్గురు కలిసి మద్యం సేవించారు. అనంతరం రామవ్వ మెడలోంచి తులం బంగారు ఆభరణంతో పాటు 50 తులాల వెండి కడియాలు తస్కరించి పరారయ్యారు. మద్యం మత్తు నుంచి తేరుకున్న అనంతరం వృద్ధురాలు తన ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలు తెలిపిన వివరాల ఆధారంగా నిందితుడు బైక్‌పై వెళ్తున్న సీసీ టీవీ దృశ్యాలను పోలీసులు విడుదల చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



బాలయ్య (ఫైల్)

దుబ్బాకటౌన్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బోనగిరి బాలయ్య (65) భార్య హంసవ్వతో కలిసి వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఇరువురి మధ్య గొడవ జరిగి హంసవ్వ అమ్మగారింటికి వెళ్లిపోయింది. దీంతో పెద్దల సమక్షంలో మాట్లాడే ప్రయత్నం చేసినా ఆమె ఒప్పుకోలేదు. బాలయ్య తరచూ తన కూతురికి ఫోన్ చేస్తూ బాధపడేవాడు. దీంతో మనస్తాపానికి గురై అతడు ఆదివారం ఉరివేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాసాయిపేట మండల పోతాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బర్రె మహేశ్(30) ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. మహేశ్ ఇటీవల కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన అతడు శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మెదక్ పట్టణంలో వ్యక్తి..

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన మధుసూదన్‌రెడ్డి, భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. అతడు బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు వృథా చేయడంతోపాటు మద్యం తాగి భార్యను కొడుతున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మధుసూదన్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో భర్త..

జగదేవ్‌పూర్(గజ్వేల్): భార్య ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రె కిరణ్(27) హైదరాబాద్‌లో పనిచేస్తున్న క్రమంలో కామారెడ్డికి చెందిన నీరజను ఐదేళ్ల కింద ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గ్రామంలోనే ఉంటున్నారు. ఆమె గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తుండగా, కిరణ్ గ్రామంలోనే వ్యవసాయం, పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. వీరికి ఇద్దరు ఐదేళ్ల లోపు కుమార్తెలు ఉన్నారు. కాగా కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. భార్య ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం సాయంత్రం ఇంటి వద్ద పెద్ద కూతురుకు సెల్‌ఫోన్ ఇచ్చి తాను ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని మంచం నవారుతో ఉరేసుకున్నాడు. ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.

స్టాల్స్ సందర్శించి.. ప్రదర్శనలు తిలకించి



రైతు మహోత్సవంలో వర్గల్ రైతులు

రైతు మహోత్సవ ప్రాంగణం వద్ద రైతులు

వర్గల్(గజ్వేల్): హుస్నాబాద్ రైతు మహోత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు, ప్రదర్శనలను ఆదివారం మండల రైతులు తిలకించారు. ములుగు ఏడీఏ అనిల్‌కుమార్, వ్యవసాయాధికారి శేషశయన ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్ల నుంచి 200 పైచిలుకు రైతులు తరలివెళ్లారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన వివిధ యంత్రాలు, డ్రోన్ పరికరాలను పరిశీలించారు. స్టాళ్లలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విడుదలైన కొత్త వంగడాల గురించి తెలుసుకున్నారు. వారి వెంట ఏఈఓలు సంతోష్, సునీత, భారతి, మానస, సుప్రజ, తేజస్వి ఉన్నారు.

యంత్రం సాగుకే మొగ్గు

- కూలీల కొరత, పెట్టుబడుల భారం తగ్గింపు
- దుక్కి దున్నేది మొదలు పంట కోత వరకు యంత్రాలే
- కిసాన్ మేళాలో రైతుల పరిశీలన



గౌరవెల్లిలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తనం వేస్తున్న రైతు



యంత్రంతో వరి నాట్లు వేస్తున్న రైతు

హుస్నాబాద్‌రూరల్: వానాకాలం మొదలవ్వడంతోనే రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతారు. ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు, విత్తనాలు వేసేందుకు కూలీలకు ముందుగా డబ్బులు చెల్లించి పనులకు తీసుకెళ్తారు. విత్తనాలు, వరి నాట్లు వేయడానికి కూలీలు దొరకకపోవడంతో బీహార్, మహారాష్ట్ర బీదర్, ఒడిశా రాష్ట్రాల నుంచి పురుషులు వస్తున్నారు. కూలీల కొరత, జాతీయ ఉపాధిహామీ పథకంతో కూలీ రేట్లు పెరగడంతో రైతులకు పెట్టుబడుల భారం పెరుగుతోంది. దీనిని అధిగమించడానికి రైతులు యంత్రాల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన కిసాన్ మేళాలో రైతులు యంత్రాల అన్వేషణలోనే నిమగ్నమై వాటి పని తీరు, ధరలు, బ్యాంకుల నుంచి అందించే రుణాల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తే అధిక దిగుబడులు తీసి వ్యవసాయంను పండగ చేస్తామని రైతులు అభిప్రాయపడుతున్నారు.

కలుపు తీయడానికి..

దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తున్న రైతులు విత్తనాలు వేసేందుకు యంత్రాలను వాడుతున్నారు. రూ.5వేలకు దొరికే విత్తన యంత్రంతో రెండు గంటల్లో ఎకరం దుక్కిలో విత్తనం వేయొచ్చు. మొక్కల మధ్య దూరం పెంచుకునే అవకాశం ఉంది. పత్తి, మొక్కజొన్న లాంటి ఆరుతడి పంటల్లో కలుపు తీయడానికి కూలీల అవసరం ఎక్కువగా ఉంటుంది. కూలీల అవసరం లేకుండా పవర్ టిల్లర్‌తో 2 గంటల్లో కలుపు తీయొచ్చు. మార్కెట్‌లో పవర్ టిల్లర్ రూ.72వేలకు దొరుకుతుంది. పత్తి తీసేందుకు, మొక్కజొన్న పంటను కోసే యంత్రాలు రైతులకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కూరగాయల విత్తనాలు నాటే యంత్రాలను కూడా కిసాన్ మేళాలో ప్రదర్శించడం ద్వారా రైతులు ఆసక్తిగా పరిశీలించారు.



కిసాన్ మేళాలో పత్తిలో కలుపు తీసే పవర్ టిల్లర్‌ను పరిశీలిస్తున్న రైతులు

నాట్లు వేసేందుకు..

వరి నాట్లు వేయాలంటే రైతులకు కూలీల కొరత ఉంది. ఒక ఎకరంలో నాటు వేయడానికి కూలీల ఖర్చు రూ.7,500 అవుతుంది. రెండు లీటర్ల పెట్రోల్‌తో మిషన్ ఎకరం నాటు వేస్తుంది. ఎకరాకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు నాటు వేసే యంత్రాలు అద్దెకు దొరుకుతాయి. యంత్రం సహాయంతో నాటు వస్తే డబ్బులు తక్కువ, సమయం కూడా ఆదా అవుతుంది. వరిలో కలుపు తీసే వీడర్ మార్కెట్‌లో ఉంది. రైతులు వరి నాటు మొదలు కోత వరకు యంత్రాల కోసమే ఎదురు చూస్తున్నారు.

సబ్సిడీపై ఇవ్వాలి



కిసాన్ మేళా వల్ల గ్రామాల రైతులకు చాలా విషయాలు తెలిశాయి. కూలీల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతులకు పెట్టుబడుల భారం తగ్గుతుంది. డ్రోన్ సహాయంతో ఎరువులు పిచికారీ చేయడం వల్ల రైతులకు క్రిమిసంహారక మందుల ప్రమాదం తప్పుతుంది. ఊరికి నాలుగు నాటు వేసే యంత్రాలు, డ్రోన్లు, సాగుకు ఉపయోగపడే యంత్రాలు ఇస్తే ఊరందరికి ఉపయోగపడతాయి.

– అలేటి ఈశ్వర్‌రెడ్డి, రైతు, పోతారం(ఎస్)